క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ తెలిపారు. స్థానిక 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ధనవాలా సబ్‌స్టేషన్, ఆర్టీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్స్, నిర్మల్ రోడ్డు, ఓవైసీ నగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్‌మినార్, మదీనా, భట్టిగల్లి, పురాణబజార్, పల్సి, స్పిన్నింగ్ మిల్ ఫీడర్, కుభీర్, తానూర్, దేగాం, కల్లూర్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముధోల్ ఎస్సైగా బిట్లా పెర్సీ



ముధోల్: ముధోల్ మండల నూతన ఎస్సైగా బిట్లా పెర్సీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన సంజీవ్‌కుమార్ నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా.. నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన బిట్లా పెర్సీ ముధోల్ వచ్చారు. ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.

బ్యాంకు రుణాలపై అవగాహన



మాట్లాడుతున్న అధికారి గీత

సోన్: మండలంలోని మాదాపూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అందించే రుణాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఎంహెచ్ ప్రాసెసింగ్ ఆఫీసర్ గీత మాట్లాడుతూ రైతునేస్తం ద్వారా రెండెకరాలు, అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు రూ.15 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. హౌసింగ్ లోన్, మార్ట్‌గేజ్ లోన్, ఎడ్యుకేషన్‌లోన్, బిజినెస్ లోన్లు ఇస్తామని.. వివరాలకు బ్యాంకులో సంప్రదించాలని కోరారు. మాదాపూర్ శాఖ మేనేజర్ పుష్పలత, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులు రవాణా చేయొద్దు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి

నర్సాపూర్(జి): బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ (జి) పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గోవధ నిషేధమని.. పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్సై సాయికిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్‌లో రూ.85లక్షలతో సీసీ, డ్రెయినేజీ పనులు ప్రారంభించినట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్ తెలిపారు. ఈ మేరకు గురువారం పనులు ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌డీఎఫ్ నిధులతో డ్రెయినేజీ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ చందూలాల్, మున్సిపల్ డీఈఈ సంతోష్ జాదవ్ ఉన్నారు.

నల్లబెల్లం, పటిక తరలిస్తున్న ముగ్గురిపై కేసు

ఖానాపూర్: పట్టణంలోని పాతబస్టాండ్ రాఫే ఖాన్ కిరాణా దుకాణం నుంచి అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. ఆటోలో తరలిస్తున్న 500 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటికను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో మృతి



లక్ష్మిబాయి (ఫైల్)

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ వీఆర్ఏ అయిటి లక్ష్మీబాయి(61) గురువారం గుండెపోటుతో మృతి చెందింది. తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే ఈమె అనారోగ్యంతో బాధపడుతోంది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. తహసీల్దార్ కమల్‌సింగ్, డీటీ నరేశ్‌గౌడ్, ఆర్ఐలు రాజేశ్వర్, అడెల్లు సంతాపం ప్రకటించారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం నాయకులు, అధికారులు జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీసీసీబీ వైస్‌చైర్మన్ రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో మరిన్ని జీలుగ విత్తనాలు కార్యాలయానికి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఏవో వసంత్‌రావు, ఏఈవోలు పవిత్ర, మౌనిక, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, సీఈవో ఉదయ్, డైరెక్టర్ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్త స్తంభాలకు కనెక్షన్లు ఇవ్వరూ..



రజక కాలనీలో కొత్త స్తంభం

కుభీర్:మండలకేంద్రంలోని రజక కాలనీలో ఓ విద్యుత్తు స్తంభం, ఎస్సీ కాలనీలో మరొకటి, బీసీ కాలనీల్లో మూడు పాత స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ స్తంభాల పక్కన కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు.. కానీ సంబంధిత అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కంకర రోడ్డుపై నరక ప్రయాణం

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్ తండా నుంచి నర్సింహానగర్ తండా వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు. తారురోడ్డు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



కాలువ ఇలా.. సాగునీరు అందేదెలా?



లోకేశ్వరం: మండలకేంద్రంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లడం లేదు. ఈ కాల్వ కిష్టపూర్, మన్మద్, రాజూరా, లోకేశ్వరం గ్రామాలకు సాగునీరు అందిస్తోంది. అధికారులు కాల్వను శుభ్రం చేయించి తమ పంటలకు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని.. అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



స్పందించి శుభ్రం చేయించారు

సాక్షి ఎఫెక్ట్..



చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

భైంసాటౌన్: పట్టణంలోని టీఎన్జీవోస్ కాలనీ వద్ద డ్రెయినేజీలో పూడిక పేరుకుపోయింది. ఇటీవలి వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల నుంచి చెత్తాచెదారం వచ్చి చేరడంతో డ్రెయినేజీలోని నీరు కాలనీ తోపాటు పక్కనే ఉన్న ఫైర్‌స్టేషన్ ఆవరణలోకి చేరుతోంది. దీనిపై ఈనెల 24న భైంసాలో ముందస్తు చర్యలేవి శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు గురువారం పారిశుధ్య సిబ్బందితో చెత్త తొలగించారు. కానీ కల్వర్టు కింద డ్రెయినేజీలో భారీక పూడిక ఉండటంతో కాలనీవాసులు నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం ప్రైవేట్ పారిశుధ్య కార్మికులతో డ్రెయినేజీలో పూడిక తొలగింపజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బి. రాజేశ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు, డ్రైడే పాటించడం, ఇతర కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించారు. సమావేశంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యుడు కమలేశ్, హెచ్ఈవో కలీమొద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, సీహెచ్‌ఓ గంగాధర్, సీడీపీవో రాజశ్రీ పాల్గొన్నారు.

ముధోల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులపై మండల ప్రత్యేకాధికారి సుదర్శన్.. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా నీటి ట్యాంకులు, డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివకుమార్, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు ఉన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం



కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న సుదర్శన్

ముధోల్: తడిసిన ధాన్యాన్ని కొంటామని.. రైతులు అధైర్యపడొద్దని స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ అన్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిసిపోయింది. గురువారం తహసీల్దార్ శ్రీలతతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రం పరిశీలించి రైతులతో మాట్లాడారు. బోరిగాం గ్రామంలో వర్షానికి ఇబ్బందులు పడ్డ లోతట్టు ప్రాంతాల్లో ఆరు కుటుంబాలకు రెవెన్యూశాఖ తరఫున బియ్యం అందించినట్లు తెలిపారు. ఆర్ఐ సరస్వతీ, సిబ్బంది ఉన్నారు.

కొనుగోళ్లు పూర్తి చేయాలి

కుంటాల: ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ కమల్ సింగ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంబకంటి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థుల ప్రవర్తన పరిశీలించాలి



మాట్లాడుతున్న షీ టీం ఎస్సై నర్సయ్య

నిర్మల్‌టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను పరిశీలించాలని.. అనుమానాస్పదంగా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని షీ టీం ఎస్సై నర్సయ్య అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని నారాయణ పాఠశాలలో 200 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు పోక్సో చట్టాలు, బాల్యవివాహాలు, గంజాయి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా రక్షణ, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు వేధింపులకు గురైతే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. నిర్మల్‌లో గంజాయిను రూపుమాపేందుకు ఉపాధ్యాయులు సహకారం అందించాలని కోరారు. పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని చేసిన వారికే పార్టీ పదవులు



మాట్లాడుతున్న నారాయణ్‌రావుపటేల్

ముధోల్: కాంగ్రెస్ అభివృద్ధికి పని చేసిన కార్యకర్తలకే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నారాయణ్‌రావుపటేల్ అన్నారు. గురువారం ముధోల్‌లోని జీఎం ఫంక్షన్‌హాలులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముధోల్, తానూరు, బాసర మండలాల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ మండల అధ్యక్షుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల ఆధారంగా కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎంపిక చేసిన వారిపేర్లను సీల్డ్ కవర్‌లో పార్టీ పెద్దలకు అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను వివరించాలని సూచించారు. ముధోల్, బాసర, తానూర్ మండలాల పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, రమేశ్, మురళి, నాయకులు ముత్యంరెడ్డి, శంకర్ చంద్రే, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్‌పటేల్, రావుల శ్రీనివాస్, చంద్రకాంత్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ఖానాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 14 రకాల ప్రధాన పంటలకు కనీస మద్దతు ధర పెంచించని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ అన్నారు. ఈమేరకు పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో గురువారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, మనోజ్, మహేందర్, రవీందర్‌రెడ్డి, రమేశ్, లింబాద్రి, కిషన్ రెడ్డి, భూమన్న, గిరి, స్వామి, భీమన్న, రాజేందర్, పవన్, అనిల్‌రావు తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి, మస్కాపూర్, సుర్జాపూర్, పాతఎల్లాపూర్ గ్రామాల్లో మైలారపు రాజు, తోకల శ్రీనివాస్, మచ్చేందర్, తునికి రంజిత్, జెట్టి చిన్న రాజన్న, అల్లెపు రాజు మృతిచెందగా.. గురువారం బాధిత కుటుంబాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ పరామర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, అంకం మహేందర్, కీర్తి మనోజ్, నాయకులు ఉన్నారు.

పోడు భూముల్లో తవ్వకాలు



తవ్వకాలు చేపడుతున్న అటవీ అధికారులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి కొమ్ము తండా శివారులో పోడు సాగుదారు బోదాసు బాలయ్యకు చెందిన ఐదెకరాల భూమిలో గురువారం అటవీశాఖ అధికారులు పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టారు. ఎఫ్‌డీపీటీ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌వో కిరణ్ ఆధ్వర్యంలో ప్లాంటేషన్‌తోపాటు ఇంకుడు గుంతల కోసం తవ్వకాలు చేపట్టినట్లు అటవీ అధికారులు, సిబ్బంది తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ లేని వారు అటవీ భూముల్లో సాగు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్వో మహేశ్, ఎఫ్ఎస్‌వోలు రవీందర్, కుతుబుద్దీన్, శ్రీనివాస్, రత్నయ్య, సదాశివ్ తదితరులు ఉన్నారు.

మోసపోతే 1930కి ఫిర్యాదు చేయండి

ఖానాపూర్: సైబర్ మోసాల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీనంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని ఎల్‌డీఎం రాంగోపాల్ సూచించారు. గురువారం పట్టణంలోని పలు బ్యాంకులను సందర్శించి ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులతో నగదు లావాదేవీలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. ఆయన వెంట ఆయా బ్యాంకుల మేనేజర్లు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతల క్షీరాభిషేకం

కడెం: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పేదలకు కార్పొరేట్ విద్య అందుతుందని ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్‌కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరవడంతో గురువారం కడెంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌వర్మ, శ్రీనివాస్‌యాదవ్, యాదగిరి, బబ్లూ తదితరులున్నారు.

ఖానాపూర్‌లోనే ఏర్పాటు చేయాలి

ఖానాపూర్: నియోజకవర్గానికి మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఖానాపూర్ మండల, పట్టణ పరిధిలో ఏర్పాటు చేయాలని పట్టణానికి చెందిన పలువురు యువకులు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాత, మండల విద్యావనరుల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. కానవేని ప్రణయ్, బీసీ రమేశ్, జట్టి వెంకటేష్, నడిమట్ల సురేశ్, గోడపురం సందీప్, దాసరి అఖిల్, సాయి, కిరణ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

నర్సాపూర్(జి): కలెక్టర్, డీపీఆర్‌వో ఆదేశాల మేరకు గురువారం మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధి ధర్మాపూర్‌లో కళాజాత నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు ప్రభుత్వ పథకాలు, భూభారతి చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, సీనియర్ సిటిజన్ యాక్ట్, బాల కార్మికుల నిర్మూలన, బాల్యవివాహాల నిషేధం తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కళాకారులు తోట లక్ష్మణ్, రఘు, జితేందర్, సుదర్శన్, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం

సారంగపూర్: ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం బారిన పడుతామని ప్రత్యేకాధికారి అబ్దుల్ అజీజ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం కిరాణ దుకాణాలు, హోటళ్ల యజమానులు, మహిళా సంఘాల సభ్యులకు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మానవ శరీరంపై చూపే దుష్పరిణామాలను స్క్రీన్‌పై చూపించారు. కార్యదర్శులు కృష్ణ, గోపి, తదితరులున్నారు.

తీరిన తాగునీటి సమస్య

కుంటాల: ఇచ్చిన హామీ మేరకు మండలంలోని కల్లూరు వడ్డెర కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి నీటి సమస్యను తీసుకెళ్లారు. వారు స్పందించి ఎంపీ నిధులతో గురువారం కాలనీలో బోరుబావిని తవ్వించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, చిన్నారెడ్డి, రజనీకాంత్, లక్ష్మణ్, సాయిరాం, రమాకాంత్, నారాయణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

భైంసారూరల్: కుంటాల మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన ముద్దం ప్రభాకర్ కుటుంబానికి గురువారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో ఎల్‌ఓసీని అందజేశారు. ముద్దం ప్రభాకర్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి బాధిత కుటుంబీకులకు అందజేశారు.కార్యక్రమంలో పలువురు నాయకులు బుచ్చన్న, సాగర్‌రావు, సాయి, నవీన్, భోజన్న తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించాలి



కరపత్రాలతో ఎంఈఓ సుభాష్, టీచర్లు

భైంసారూరల్: అన్ని సౌకర్యాలున్న సర్కారు బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ఎంఈవో సుభాష్ పేర్కొన్నారు. మండలంలోని పేండ్‌పెల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ పాఠశాలల్లో బోధన, వసతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాటేగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమణారావు, హెచ్ఎం అమృతం, ఉపాధ్యాయులు గోపాల్, తదితరులు ఉన్నారు.

ఘనంగా అనఘాదత్త వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గండిరామన్న దత్తసాయి ఆలయ ప్రాంగణంలో గురువారం అనఘాదత్తవ్రతం ఘనంగా నిర్వహించారు. అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి ఆశీస్సులతో సాయిదీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సామూహిక వ్రతంలో 108జంటలు పాల్గొన్నాయి. కరీంనగర్‌కు చెందిన వేణుగోపాలశర్మ వ్రతం చేయించి అనఘాదేవి, దత్తాత్రేయుల గురించి భక్తులకు వివరించారు. సాయిదీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. సమితి సభ్యులు నందు, నరహరి, నారాయణరెడ్డి, జైపాల్‌రెడ్డి, సోమేశ్వర్, కోల శంకర్, రమేశ్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం..

జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ విశ్వకర్మ భగవాన్ ఆలయ రెండో వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు, యజ్ఞ హోమాది కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు.

రోడ్డుపై కూరగాయలు విక్రయించొద్దు



రోడ్డుపైకి రాకుండా మార్కింగ్ చేయించి దుకాణాలు తీసివేయిస్తున్న కమిషనర్ జగదీశ్వర్

నిర్మల్‌టౌన్: రోడ్డుపై కూరగాయలు విక్రయించొద్దని.. పట్టణంలోని గాంధీ మార్కెట్‌లో నిర్మించిన షెడ్డులోనే కూరగాయలు విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ చిరువ్యాపారులకు సూచించారు. ఇంద్రనగర్ కాలనీవాసుల ఫిర్యాదులతో.. గురువారం మార్కెట్ ఏరియాలో రోడ్డుపై కూరగాయలు విక్రయించే చిరువ్యాపారుల దుకాణాలను పోలీసుల సహకారంతో తీయించారు. కమిషనర్ మాట్లాడుతూ కూరగాయలు రోడ్డుపై విక్రయించడం ద్వారా ఇంద్రనగర్ నుంచి వచ్చే వాహనదారులకు ఇబ్బంది అవుతుందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డుపై కూరగాయల దుకాణాలను తీయించినట్లు పేర్కొన్నారు. రోజు మార్కెట్‌ను సందర్శిస్తామని.. ఎవరైనా రోడ్డుపై అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెప్మా పీడీ సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే జైలుకే



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

భైంసాటౌన్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని టాస్క్‌ఫోర్స్ అధికారులు డీలర్లకు సూచించారు. గురువారం పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా విత్తన నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పీసీలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు విత్తనాల కొనే సమయంలో రశీదు పొందాలన్నారు. పీసీ, లాట్ నంబర్ సరి చూసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఏడీఏ విద్యాసాగర్, డీఎస్ఎస్‌డీసీ డీఎం అతుల్‌జైన్, భైంసా ఏడీఏ వీణ, ఏవో రవి, గణేశ్, పట్టణ సీఐ గోపినాథ్ తదితరులు ఉన్నారు.

మైత్రిబంధం చాటిన మిత్రబృందం



బాధిత కుటుంబసభ్యులతో స్నేహితుల బృందం

నిర్మల్‌ఖిల్లా: తమ చిన్ననాటి మిత్రుడి కుమార్తె ఆపదలో ఉందని తెలుసుకున్న మిత్రబృందం అంతా కలిసి ఆ కుటుంబానికి ఆర్థిక చేయూతనందించారు. లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి చెందిన వన్నెల దేవన్న కూతురు శరణ్య తీవ్ర అనారోగ్యం బారినపడి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలిసి 1998-99లో దేవన్నతో ఎస్ఎస్‌సీ చదువుకున్న చిన్ననాటి మిత్రులంతా కలిసి రూ.36,100 పోగు చేశారు. గురువారం హాస్పిటల్‌కు వెళ్లి నగదు అందించి దాతృత్వం చాటుకున్నారు. శరణ్య చికిత్స కోసం ఇప్పటికే హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.6 లక్షలకు పైగా ఖర్చు చేశారు. కార్యక్రమంలో మిత్రబృందం టి.అనంత కిశోర్, కె.శ్యామ్, రాజ్‌కుమార్, ఆనంద్, జి.రవీందర్, డి.రవి, శ్యాం ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి ‘మహాలక్ష్మి’ రద్దీ





మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరిగింది. గురువారం నిర్మల్ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సులో సీటు కోసం కిటికీలో నుంచి ప్రమాదకరంగా ఎక్కుతూ కనిపించారు. ఆదిలాబాద్, నిజామాబాద్, ఖానాపూర్ వెళ్లే బస్సుల్లో రద్దీ కన్పించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్